# సహగమనం

## మధురాంతకం నరేంద్ర

(గతసంచిక తరువాయి)

### 7

"జీవితమంటే పెద్దరొటీన్ అని నిర్వచించినవాడు, నిజంగా మందమతి అయివుంటాడండీ డాక్టరుగారూ!" టీ కప్పును చేతికందుకుంటూ అన్నాడు సాగర్.

బాల్కనీ పిట్టగోడకవతల; తాము పెయింటింగ్‌లోని బొమ్మలంకామని తెలియజేయడకోసమన్నట్టుగా తలవూపుతున్న కొబ్బరిచెట్ల వెనక; వొకదానితో వొకటి పోటీపడుతున్నట్టుగా మింటికెగసిపోతున్న నక్షత్రాల హోటళ్ళకు దూరంగా; ఫ్యాక్టరీ పొగగొట్టాలతో సంధికుదుర్చుకున్న బూడిదరంగు ఆకాశంపైన, సంధ్య వెలుతుర్లు బిక్కుబిక్కుమంటూ పరచుకున్నాయి.

పిట్టగోడక్రిందున్న కుండీల్లోని క్రోటన్ మొక్కలు పువ్వేదో ఆకేదో తెలియనివ్వకుండా జాగ్రత్త పడుతున్నాయి.

కాలనీరోడ్డు వాహనాల రణగొణధ్వని వినిపిస్తూనే వుంది. యింటిలోపలినుంచి పాశ్చాత్య సంగీతం కొరడాను ఝుళిపిస్తూనే వుంది.

సగం నెరిసిన వెంట్రుకల్ని వో చేత్తో సవరించుకుంటూ "మీ 'పీస్ అండ్ ఫెటర్నటీ అసోసియేషన్' యినాక్టివ్‌గా తయారయినట్టుంది సాగర్" అంది డాక్టర్ సుందరవల్లి.

"మీరు టాపిక్ మారుస్తున్నారన్న విషయం నాకు స్పష్టంగానే తెలిసిపోతోందండీ" అంటూ ముఖం ముడుచుకున్నాడు సాగర్.

"తెలిసిపోతే మరేమీ ప్రమాదం లేదులేవయ్యా ఫిలాసఫరూ!" అమె నవ్వేసింది "స్వతహాగా డాక్టర్ని గదా! యేయే జబ్బుకేయేమందులివ్వాలో నాకు బాగా తెలుసు. పల్స్ చూడకపోయినా నువ్విప్పుడు టెన్షన్‌లో వున్నావని చెప్పెయ్యగలను. వుద్రేకంలో వున్న మనిషికి, ఆ వుద్రేకానికి కారణమైన టాపిక్ నుంచీ కాస్సేపు దూరంగా తీసుకెళ్ళడమే మెడిసిన్ ...."

"అయినా అసోసియేషన్‌కు నేను కేవలం కార్యదర్శిని మాత్రమే గదండీ! అధ్యక్షులు మీ ఆయనే గదా! యీ విషయం ప్రొఫెసరుగారినే అడక్కపోయారా మీరు?"

"నేను వదలిపెట్టేదాన్ని కానని నీకు తెలిసేవుంటుంది" ఆమె మరోమారు బిగ్గరగా నవ్వేసింది. "ఆయనే చెప్పారు - పోయిన సారి యెగ్జిక్యూటివ్ బాడీ మీటింగుకు సెక్రటరీ ప్రెసిడెంటూ - అంటే నువ్వూ ఆయనా. యిద్దరు మాత్రమే హాజరయ్యారట గదా?"

"యేం చెయ్యమంటారండీ డాక్టరుగారూ! అంతా బలవంతపు బ్రాహ్మణార్థమైపోయింది. యేదో గొప్ప పనిచేస్తున్నామన్న కీర్తి తమకుమాత్రం యెందుకు దక్కకూడదని అందరూ అనుకుంటారు. కానీ దానికోసం వొక అరగంటయినా స్పెండ్ చేయటానికి తీరికుండదు పాపం! యెవడో వొకడు గొడ్డుచాకిరి చేసి, యేదయినా చేస్తే క్రెడిట్ నాదంటే నాదని కీచులాడుకుంటారు అందరూ. మందలించాలంటే చిన్నవాళ్ళెవరూ లేరు గదా! డాక్టర్లూ, లాయర్లూ. బిజినెస్ మాగ్నెట్లూ! యిలాంటి వాళ్ళనేనండీ లిటరరీ యిల్లిటరేట్సని పిలిచేది! విసుగెత్తిపోయి, వొకోసారి ఫైళ్ళన్నీ డస్టబిన్‌లో పడేసి, లెట్ ది అసోసియేషన్ గోటుది డాగ్సని చేతులు కడిగేసుకోవాలనిపిస్తుంది. కానీ జీవితానికి సంతృప్తిని కలిగించే, యీ పని చేజేతులా నాశనం చేయాలని అనిపించదు. చుట్టూనెలకొన్న కొండంత చీకటిని ప్రారదోలడం కోసం, చిన్న ప్రమిదనయినా వెలిగించడమన్నది మా 'మాటో' గదా! అందుకే వొకరిద్దరం పట్ట బలవంతాన నెట్టుకొస్తున్నాం దీన్ని. వొకమాటడుగుతాను, యేమీ అనుకోకండి డాక్టరుగారూ! మా అసోసియేషన్‌లో మీకు గూడా సాధారణసభ్యత్వముంది గదా! ప్రతి సభ్యుడూ కనీసం రెండు నెలల కొకసారయినా, మీటింగుకు రావాలని నియమం గూడా వుంది గదా! మీరొచ్చి యెన్నేళ్ళయి పోయిందో చెప్పండి?"

"నువ్వామాట అడుగుతావేమోనని భయపడుతూనే వున్నానయ్యా నేను. కానీ యేం చెయ్యను చెప్పు? మా ప్రొఫెషనుకున్న యిబ్బందే అది! క్షణం తీరికుండదు. ప్రయివేటు నర్సింగ్‌హోం ప్రారంభించి నప్పటినుంచీ రెస్టంటే యేమిటో నాకు తెలియకుండా పోయింది. యిద్దరు అసిస్టెంట్లున్నారన్న మాటేగానీ, అన్నీ నేనే దగ్గరుండి చూసుకోవాలి. సాయంకాలం ఆరింటికంతా యింటికొచ్చేసేయమని ఆయన రోజూ పోరుతూనే వుంటారు. 'అలా టైమింగ్ ప్రకారం నడవడానికి నేనేమయినా మీలా అకడమిక్ ఫీల్డులో పనిచేస్తున్నాననుకుంటున్నారా' అని ఆయన కంటే బిగ్గరగా కేకలేసి, ఆయన్ని మాట్లాడనివ్వకుండా తప్పించుకుంటున్నాను. అంతెందుకు, నాతో యేదో మాట్లాడడంకోసం అపాయింట్‌మెంట్ కావాలని ఫోన్ చేశావుగదా నువ్వు! నిన్ననే అరేంజ్ చేయాలనుకున్నాను. కానీ అర్జెంటుగా వొక డెలివరీకేసొచ్చింది. వీల్లేకపోయింది. యిప్పుడయినా, నేనిలా యిక్కడ కూచున్నానన్న మాటేగానీ. ధ్యాసంతా అక్కడే వుంది...." అమె బిగ్గరగా నిట్టూర్చింది.

"మీ బాధను అర్థంచేసుకోగలనండీ! ఆదర్శాలు చెప్పడం చాలా సులభం. ఆచరణ దగ్గరికొచ్చేసరికి గానీ అందులోని యిబ్బందులు అర్థంగావు. వొకమంచి పని చేయాలని అనుకున్నారనుకోండి, వెయ్యి అడ్డంకులు యెదురవుతాయి. యేం చేయాలోగూడా అర్థంగాని పరిస్థితి యెదురవుతుంది. వొక సమస్య వున్నట్టుగా

మరొకటుండదు. అందుకే జీవితాన్ని రొటీనని డిఫైన్ చేసినవారు డల్ హెడెడ్ మానని అన్నాన్నేను. మళ్ళీ పాతటాపిక్ దగ్గరకొచ్చానని అనుకుంటున్నారు గదా మీరు! లాభంలేదండీ డాక్టరుగారూ, అంత సులభంగా మరచిపోగలిగే సమస్య కాదండీ యిది! వొక అన్నయ్య యింతవరకెవ్వరూ యిలాంటి పరిస్థితిని యెదుర్కొని వుండడు. మీరెందరో వ్యక్తుల్ని చూసివుంటారు. యే యితరవ్యక్తి అడిగివుండని సహాయాన్ని నేనిప్పుడు మిమ్మల్ని అర్థించబోతున్నాను. మీరు సరే నంటే గానీ నాకీ టెన్షను తగ్గదు....,...."

నుదుటిపైన చెమట బిందువులు పొటమరించాయి. పెదవులు వణకుతున్నాయి. కంటికి కనిపించని ఆధారాన్ని దేన్నో వూతగా పట్టుకుంటున్నట్టుగా పిడికిళ్లు బిగిస్తున్నాయి. వుద్వేగంతో బిగ్గరగా వుచ్ఛ్వాసనిశ్వాసాలు విడుస్తూ రొప్ప సాగాడు అతను.

అతడి ఆవేశపు పొంగుల్ని అరికట్టడంకోసం వొక చిరునవ్వును చిలకరించడానికి ప్రయత్నించింది ఆమె.

"నాతో నువ్వే విషయం గురించయినా నిస్సందేహంగా మాట్లాడొచ్చు కొత్తవ్యక్తితో మాట్లాడుతున్నట్టుగా నువ్విలా టెన్షన్ ఫీలవ వలసిన అవసరంలేదు. దాదాపు పదిహేనేళ్ళుగా పరిచయముంది గదా నీకూ మీ ఫామిలీతో నాకున్న స్నేహం యీనాటిదా చెప్పు? యింట్లో యే చిన్న ఫంక్షను జరిగినా, మీ ప్రొఫెసరుగారికి నువ్వు పక్కన లేకుంటే కాళ్ళూ చేతులూ ఆడవు. యింతటి అటాచ్‌మెంటున్న వ్యక్తి దగ్గర నువ్విలా బిడియ పడితే యెంత బాధగా వుంటుందో ఆలోచించిందావా నువ్వు?"

"అయ్యయ్యో! మీరలా అనుకోకండి డాక్టరుగారూ!" కలవరపడిపోతూ ఆమె మాటలకు అడ్డు తగిలాడు సాగర్. "చెప్పడానికి అభ్యంతరమేదీ లేదండీ! ఎలా మొదలుపెట్టాలో, యెలా చెప్పాలో తోచక తికమక పడిపోతున్నానంతే!.... కాసేపు ఆగి మళ్ళీ చెప్పసాగాడు. యీ సమస్య యెక్కడ ప్రారంభమయిందో స్పష్టంగా తెలిస్తే, అక్కడి నుంచీ చెప్పడం ప్రారంభించవచ్చు. ఆలోచిస్తే యీ సమస్య మొదలేదో చూపెట్టలేని విషవలయంలా కనిపిస్తోంది. యెక్కడ ప్రారంభమయిందో తెలియదుగానీ, చూస్తుండగానే పెద్దవూబిలా తయారైపోయింది. వూపిరి తిప్పుకోనివ్వడంలేదు.

"...... ...... ......"

"జరిగిందేమిటో మీకు తెలుసు. అనుకోకుండా మా ఫామిలీకి పెద్ద షాక్ తగిలింది. పెళ్ళయి ఆరునెలలయినా గడిచీ గడవకముందే చిరంజీవి పోయాడు. షాక్‌తో మంచంపట్టిన మానసను మీరే ట్రీట్ చేశారు గదా! యింకా మానస పూర్తిగా కోలుకోలేదన్న విషయంగూడా మీకు తెలుసు. తాను వద్దని అంటున్నా బలవంతంగా పెళ్ళి చేయించినవాడిని నేనే! హాయిగా, సుఖంగా, నవ్వుతూ నవ్విస్తూ తిరగవలసిన వ్యక్తి; వున్నట్టుండి మోడుగా మారిపోతే చూస్తూ భరించలేక పోయాను. యీ సమస్యకు పరిష్కారం చూపెట్టవలసిన బాధ్యత నాపైనేవుంది అందుకే నేనే ఇన్షియేటివ్ తీసుకున్నాను. యెన్ని కష్టాలనయినా భరించి, యెన్ని అడ్డంకులనయినా యెదిరించి. మానసకు మళ్ళీపెళ్ళి చేయాలని నిర్ణయించుకున్నాను..."

"మళ్ళీ పెళ్ళా?"

"అవునండీ.. రీ మేరేజ్.. తప్పంటారామీరు?"

"తప్పనిగాదు...." ఆమె తడబడిపోయింది.

మరి....అందుకు..."

"మీ సందేహం నాకు తెలుసునండీ! మళ్ళీపెళ్లి చేసుకోవడానికి ఒప్పుకునే వ్యక్తి యెవరు దొరుకుతాడా అని మీ అనుమానం,..ప్రపంచం ఇంకా గొడ్డుపోలేదండి! ఆదర్శాలకోసం తమ జీవితాల్ని కత్తిపైన సాముగా మార్చుకునే వ్యక్తులు ఇంకా వున్నారు..."

"యెవరతను ?" ఆమె కుతూహలాన్ని ఆపుకోలేకపోయింది.

"మా రాజేష్..."

"నిజంగా !"

"అవునండీ ! మొదట తనకు తానుగా అతనే ఆ మాట అన్నప్పుడు నేను సైతం నా చెవుల్ని నేను నమ్మలేక పోయాను. యిక నేను చేసిన తప్పుకు ప్రాయశ్చిత్తం చేసేసుకోవచ్చునని అనుకున్నాను. కానీ ముసళ్లపండుగ ముందేవుందని అర్థంచేసుకోలేక పోయాను..."

"........."

"అమ్మనూ నాన్ననూ వొప్పించేసరికి నా తలప్రాణం తోకకొచ్చింది. కూతురి జీవితం బాగుపడడం కంటే వాళ్లకు కావలసిందేముంటుంది ? కానీ వాళ్లెందుకో భయపడి పోయారు. యెన్నిసందేహాలు వెలిబుచ్చారనుకున్నారు ? ఆ అబ్బాయి నిజంగా వొప్పుకున్నాడా ? వాళ్ల అమ్మానాన్నా యేమన్నారు ? పెళ్లయ్యాక అతడెలా ప్రవర్తిస్తాడోయేమో ! అతడెలాంటివాడు ? యింతకూ అతడు ఆరోగ్యవంతుడేనా ? మీకు నవ్వొస్తోంది గదూ ? మీరు నమ్మలేరుగానీ వాళ్లు యింకా చాలా సిల్లిసందేహాలు బయట పెట్టారు. వాళ్ల సందేహాల్ని తీర్చి వొప్పించేసరికి నా తలబట్టగట్టిపోయింది. అప్పుడే యేం జరిగిందిలెండి ? అమ్మానాన్నల్ని వొప్పించడం వొకింతయితే, మానసకు నచ్చజెప్పడం రెండింతలు ! యెంత చెప్పినా 'వూ' అనదు, 'ఆ' అనదు. స్తబ్దంగా కూర్చుంటుంది. గట్టిగా కేకలేస్తే కంటికి కడివెడుకారుస్తుంది. చచ్చిగీపెట్టినా పెదవివిప్పదు చివరికి మౌనమే అర్ధాంగీకారంగా భావించి, రాజేష్‌కు పచ్చజెండా చూపెట్టాను...."

"మానస అత్తా, మామా...."

"మొదట వాళ్లుకూడా అమ్మానాన్నల్లాగే సవాలక్ష సందేహాల్ని వెలిబుచ్చారు. అన్నీవివరంగా చెప్పడానికి నావోపిక చచ్చిపోయింది. 'నాకు మంచి అని తోచింది నేను చేస్తున్నాను. మీరెలా అనుకున్నా నాకు అభ్యంతరం లేదు' అని వొక్కమాటతో తేగేసి చెప్పి, నేనొచ్చేశాను. చివరకు వాళ్లు యేమనుకున్నారో యేమో, అభ్యంతరం చెప్పలేదు...."

"కానీ...."

"మనుషుల్ని వొప్పించడంతో పనయిపోయిందనుకుని, చేతులు కడుక్కోడానికి సిద్ధపడ్డాన్నేను. యింతలో 'పరిస్థితులు' మేమున్నామంటూ విరుచుకుపడ్డాయి. ఆవేళ మీరొచ్చి మానసను టెస్ట్‌చేశారు...."

"......"

"ఫేట్... విధి....యీ పరిస్థితికి పేరేదైతేనేం ? సమస్య మళ్లీ మొదటి కొచ్చింది...యిప్పుడు పరిష్కారం మీ చేతుల్లో వుంది...."

"నా చేతుల్లోనా ? !"

"అవునండీ డాక్టరు గారూ ! మానస జీవితం, ఆమె భవిష్యత్తూ మీ చేతుల్లో వున్నాయి...."

"అంటే ! ?"

"మానసకు ముందే మరోపెళ్లి జరిగిందని తెలియజేసే సజీవసాక్ష్యం వుండగూడదని రాజేష్ షరతు...."

"అందుకని...."

"ఆటువంటి సాక్ష్యమొకటి యీలోకంలోకి వూడిపడకుండా జాగ్రత్తపడాలి. అందుకు మీరు సహాయపడాలి...."

డాక్టరు సుందరవల్లి చాలా సేపటివరకూ జవాబు చెప్పలేకపోయింది.

సాగర్ అసహనంగా సమాధానంకోసం యెదురు చూడసాగాడు.

ఆకాశంలోంచీ కెంజాయరంగు పారిపోయి చాలా సేపయిపోయింది. నగరంలో విద్యుద్దీపాల సంరంభం ప్రారంభమైపోయింది డాక్టరుగారి గృహాంతర్భాగంలో సైతం దీపాలు వెలిగాయి. బాల్కనీలో మాత్రం యింకా చీకటి కొలువు చేస్తూనేవుంది.

డాక్టర్ సుందరవల్లి గొంతు సవరించుకుంది—"మానస మామగారిని కలిశావా నువ్వు ?"

"ఆయననా ? యెందుకు కలవడం ?" సాగర్ విస్తుపోయాడు.

"యిన్ని ఆలోచించ గలిగిన వాడివి, యింత చిన్నవిషయం స్ఫురించలేదా నీకు ?" ఆమె ఆశ్చర్యపడిపోయింది. "యిటువంటి క్రిటికల్ సిచ్యువేషన్‌లో నిర్ణయం తీసుకోవలసిన వ్యక్తి ఆయనగాక వేరెవరు ?"

"మీరేం చెబుతున్నారో నాకు అర్థంగావడం లేదండి...."

"ముందు నువ్వు నా పరిస్థితిని గూడా వోసారి ఆలోచించు వృత్తిరీత్యా నేనొకడాక్టర్ని. ప్రమాదంలోవున్న వాళ్లని చేతనయినంత వరకూ రక్షించడం నావృత్తి. యేమంటావు ?"

"నిజమేనండి ! యిప్పుడు మీరు చేయబోతున్నది గూడా అలాంటిపనే ! యెలాగంటారేమో ! వోసారి మళ్లీ ఆలోచించి చూడండి. యీ సహాయం చేయడం ద్వారా మీరు నాశనమైపోతున్న వొక జీవితానికి మళ్లీ వెలుగు చూపించిన వారవుతారు...." సాగర్ మళ్లీ ఆవేశపడసాగాడు.

"నువ్విప్పుడిలా కోపంతెచ్చుకుంటే నేనేంచేయను చెప్పు ? నేనునీకే సహాయం చేయడానికైనా సిద్ధంగా వున్నాను. కానీ ముందుకొన్ని సందేహాలకు సమాధానాలు కావాలి...."

"నేను కోప్పడడం లేదండీ...."

"నేను కోరుకుంటున్నది గూడా అదే ! మీ చెల్లెల్ని కాపాడ్డానికి నేను సిద్ధంగావున్నాను. కానీ అందుకోసం మరోప్రాణిని నాశనం చేయడం సబబుగా వుంటుందా అన్నది నా అనుమానం..."

"మీరిలా యెందుకు మాట్లాడు తున్నారో నాకెంతకూ అర్థం కావడం లేదండీ డాక్టరుగారూ ! యిందులో మరోప్రాణిని చంపేప్రశక్తి యెక్కడుంది?"

"యెందుకులేదు ? యిలాంటి వాటినే మనవాళ్లు భ్రూణహత్యలని అంటూ వుంటారు, వినలేదా నువ్వు ?"

"మరేమీ పరవాలేదు. మీరెందుకిలా తటపటాయిస్తున్నారో నాకర్థమయింది. నీతులూ న్యాయాలూ కాలానుగుణంగా మారుతూ వుంటాయి. అబార్షన్‌ను భ్రూణహత్యగా భావిస్తే యిక కొంపమునగడమయినట్టే ! మీలా అందరూ అనుకుంటే యిక దేశంలో కుటుంబనియంత్రణ పథకం గతి గోదారే అయివుండేది ! దేశంలో యీసరికి నిల్చోడాని కయినా స్థలం దొరికేది కాదు...."

"నువ్వు వాదాన్ని కేవలం వాదించడం కోసమనే అనుకోవడం యేమీ బాగా లేదు...."ఆమె అడ్డుతగిలింది. "కుటుంబ నియంత్రణ వాళ్ల 'మాటో' యేమిటి ? 'మేమిద్దరు, మాకిద్దరు'– అదీవాళ్లస్లోగన్ ! యిద్దరు పిల్లల తరువాత పిల్లల్నికంటే అది నేరం. అంటే యేమిటి ? ప్రతిదంపతులకూ యిద్దరు పిల్లల్ని పొందే అర్హత వుంది. కాబట్టి మానస కడుపులోని ప్రాణికి జీవించే నైతికహక్కుంది. దాన్ని కాదని అనడానికి మనకు హక్కులేదు ..."

"మీకు నా సంగతి నవ్వులాటగా కనిపిస్తున్నట్టుంది...." సాగర్ గింజుకున్నాడు.

"అదే నేను వద్దన్నది. నీకు సహాయం చేయడానికి నేను సిద్ధంగా వున్నాను. నా సందేహం తీరేవరకూ నువ్వువోపిక పట్టక తప్పదు. నువ్వుకోప్పడితే నేను చేయగలిగిందేమీలేదు...." ఆమె అనునయించింది.

"యిది మామూలు పరిస్థితిగాదు డాక్టర్" ఆవేశాన్ని బలవంతంగా అణచుకుంటూ నెమ్మదిగా చెప్పసాగాడు అతను. "దీన్ని మీరు అసాధారణ పరిస్థితిగా భావించాలి. యేలోటూ లేని దంపతులకయితే పిల్లలు కలగడం వొక వరం. కానీ భర్తలేని అభాగ్యురాలికి అది వొక శాపం. పరిస్థితంతా మీకు వివరంగా చెప్పాను. రాజేష్ పెట్టిన షరతు మీకు తెలుసు. ఆ పొరబాటే గనుక జరిగితే, మానస జీవితం యెడారైపోతుంది. పాతికేళ్ళయినా నిండకమునుపే ముసలిదైపోవాలి. సాటి స్త్రీపైన మీకు కనికరం కలగడంలేదెందుకో?..."

"అయితే వొకమనిషికి పునర్జన్మ యివ్వడంకోసం, మరో మనిషిని చంపి పారేయమంటావు...."

"మీరలా అంటే నేనేం చెప్పగలను ?" సాగర్ తుపాకి గుండు తగిలినట్టుగా విలవిల లాడిపోయాడు. "యింకా రూపొన్నయినా ధరించని బిడ్డకూ పాతికేళ్ళ అమ్మాయికీ — యిద్దరికీ వొకే న్యాయమేనా ?"

"యెందుకుండకూడదు?"

సాగర్ మనసు కకావికలై పోసాగింది.

"యిద్దరు మనుషుల్లో వొకరికి వొకన్యాయం, మరోకరికి యింకొక న్యాయం అంటూ వుండవు. డాక్టరుగా వొక ప్రాణిని చంపే హక్కు నాకుందా చెప్పు?"

"మీరీ పని చేయకపోతే అన్యాయంగా మాచెల్లెలి జీవితం నాశనమైపోతుంది. అలా నాశనం చేసే హక్కు మాత్రం మీకుందంటారు. అంతే గదా !" తనకు ఆలంబనగా వొకవాదం దొరికిన సంరంభం అతడి మాటల్లో తొంగిచూసింది.

"ఆపని మాత్రం నేనెలా చేయగలను ? మానస మళ్ళీ కళకళలాడుతూ తిరగడమే నాకు కావలసింది గూడా !"

"మీ ధోరణి మరీ విచిత్రంగా వుందండీ" మరోసారి విస్తుపోయాడు సాగర్. "యిప్పుడు మనకు రెండు దారులు మాత్రమే వున్నాయి. వొకటి మానసను రక్షించడం. రెండోది చేజేతులా ఆమె జీవితాన్ని నాశనం చేయడం...."

"అక్కడే పొరబడుతున్నావు నువ్వు. రెండు దారులు మాత్రమే వున్నాయని యెందుకనుకోవాలి. మూడోదారి గూడా వుండొచ్చుగదా ?"

"అదెలా కుదురుతుంది ?"

"జీవించే హక్కున్న ప్రాణిని చంపడం తప్పు. ఆ హక్కు యిప్పుడిప్పుడే ప్రాణం పోసుకుంటున్న వ్యక్తికీ, వోసారి యెదురు దెబ్బతిన్న మనిషికీ- యిద్దరికీ యిచ్చి చూద్దాం...."

"యింపాజిబుల్ .... అందుకు రాజేష్ వొప్పుకోవడం లేదు ...."

"నచ్చజెప్పు...."

"యిప్పుడే అతడెంతో త్యాగం చేస్తున్నాడు. యింతకంటే యెక్కువ అడగడం భావ్యం కాదు ...."

దీనికి త్యాగమని పేరు పెట్టడం పెద్దనేరం...."

"డాక్టరుగారూ, మీదగ్గరికి రావడమే నేను చేసిన పొరబాటుగా కనిపిస్తోంది"

"నీకు మళ్ళీ కోపం వచ్చింది గదూ ?" ఆమె నవ్వేసింది. "నాకు తోటి స్త్రీ మీద కనికరం లేదని నిందించావు. నేనేమీ బాధపడలేదు. పురుషుడిగా నీకు అహంకారం పనికిరాదన్నాను. నువ్వు మాత్రం గిజగిజలాడిపోతున్నావు...."

"నేను అహంకరిస్తున్నానా ?" అతడు బెంబేలు పడిపోసాగాడు.

"కాక యింకేమిటి? యీ ప్రపంచంలోని ప్రతి వ్యక్తికీ సుఖంగా బ్రతికే హక్కుంది. ఆ హక్కును ప్రశ్నించే శక్తి యెవరికీ లేదు. మానసకు గూడా మళ్ళీ హాయిగా బ్రతికే హక్కుంది. అందుకు యెవరయినా చేయవలసింది కేవలం తోడ్పాటు మాత్రమే! దానికి త్యాగమని పేరు పెట్టడం ఘోరం...."

"యేమిటోనండీ ! నాకంతా అయోమయంగా వుంది...."

"పెద్ద విలాసవరవి. యింత చిన్న విషయం అర్థంకాకపోవడ మేమిటి ? మగవాడు రెండోపెళ్ళి చేసుకోవడం న్యాయం. స్త్రీకయితే ఆ న్యాయం వర్తించదు. అంతేనా ?"

"యెవరా మాట అన్నది? మీరు నన్ను పూర్తిగా అపార్థం చేసుకున్నారు." మాటలు కూడబలుక్కుంటూ చెప్పసాగాడు. యిది అన్యాయమని అందరూ అంటారు. నేను మరో ముందడుగు వేసి, స్త్రీకి సైతం రెండో పెళ్ళి చేయడం న్యాయమేనని నిరూపించి చూపించాలని అనుకుంటున్నాను...."

"అంతవరకూ బాగానే వుంది. రెండోపెళ్ళి మగవాణ్ణి పెళ్ళి చేసుకోవడానికి సిద్ధపడిన అమ్మాయి పరిస్థితి యెలా వుంటుందో ఆలోచించావా నువ్వు ? మీరెప్పుడయినా ఆ అమ్మాయి త్యాగం చేస్తోందని మాటవరసకయినా అన్నారా ?..."

"... ...."

"అలాంటప్పుడు, యిప్పుడు రాజేష్ త్యాగం చేస్తున్నాడని అనడంలో న్యాయం వుందా చెప్పు ?"

"... ...."

"దీన్ని త్యాగం అనరు. తోటి మనిషిగా అతడు తన బాధ్యతను నెరవేరుస్తున్నాడు. ఆ బాధ్యత తమకుందని గుర్తించేవాళ్ళు అరుదు. మనిషి మనిషిగా ప్రవర్తించడం లేదిప్పుడు. నిజమైన మానవులు కరువైపోయిన యీ లోకంలో, మీ రాజేష్ వొక రేర్ స్పెసిమెన్. అతడు నిజమైన మనిషి. తన బాధ్యతను గుర్తించిన మనిషి. ఆ మేరకు అతన్ని మెచ్చుకుందాం. గౌరవిద్దాం. కానీ త్యాగం చేస్తున్నాడని మాత్రం అనవద్దు. అలా అనడం ఘోరం. నీ వనుకుంటున్న ఆదర్శానికే అది మచ్చ...."

"నిజమేనండీ.... కానీ యింతకూ యిప్పుడు మీరు నాకు చేసిన సహాయమేమిటి?" బిగ్గరగా నిట్టూర్చాడు సాగర్. "సమస్యను మళ్ళీ మొదటికే తీసుకొచ్చారు. అంతేనా ?"

"అలాగని యెందుకనుకోవాలి ? నీకొచ్చిన సమస్య యేమిటో స్పష్టంగా విశ్లేషించి చూపెట్టానని గూడా అనుకోవచ్చుగదా !"

ఆత్మావలోకన చేసుకోవడం కోసం, సాగర్ కాస్సేపు మౌనంగా వుండి పోయాడు.

లాండ్ కాబోతున్న విమానమొకటి గుయ్యిమని రొద పెడుతూ నగరం పైన గిరికీలు కొడుతోంది. దారి తప్పిన బాటసారిలా చంద్రుడు ఆకాశం పైన్నుంచీ బిక్కు బిక్కు మని తొంగిచూస్తున్నాడు. టీవీ ప్రసారాలు ప్రారంభమ్కావడంతో, కాలనీ వీధుల్లో పిల్లలెక్కడా కనిపించడం లేదు.

"నాకంతా అయోమయంగా వుంది మేడమ్ !" వేడెక్కిపోయిన నుదుటిని అరిచేతితో పరామర్శించుకుంటూ అన్నాడు సాగర్. "వొక సమస్యను పరిష్కరించమని మీదగ్గరికొస్తే, మరో సమస్యను తీసుకొచ్చి పెట్టారు. మళ్ళీవోసారి ఆలోచించి చూడండి. రాజేష్ వాదనలో కొంచెం న్యాయముందని అనిపిస్తోంది నాకు. మీరీ సహాయం చేయగలిగితే, తరువాత యిబ్బందేమీ వుండదు...."

"అంటే నువ్వింకా స్వార్థపూరితంగానే ఆలోచిస్తున్నావన్నమాట !?"

"మళ్ళీ మీరు అలాగే మాట్లాడుతున్నారు...." విలవిల్లాడిపోయాడతను.

"నీ చెల్లెలి సుఖం కోసం మరొకరి హక్కుకు భంగం కలిగిస్తున్నావు...."

"మీకు సహాయం చేయాలని వున్నట్టు లేదండీ డాక్టరుగారూ ! అందుకే యిలా ఆకుకు అందకుండా పోకకు చెందకుండా మాట్లాడుతున్నారు." నిట్టూర్చాడు.

"నువ్వు పొరబడుతున్నావు" చివాలున అడ్డుతగిలింది ఆమె. "మీ కుటుంబం కంటే ఆత్మీయులు మరెవరూ లేరు నాకు. అందుకే నీకిలా నచ్చజెప్తున్నాను. నువ్వడుగుతున్న పనిలాంటి దెప్పుడయినా చేయవలసివచ్చినపుడు, వొకటికి రెండు సార్లు ఆలోచించి నిర్ణయం తీసుకోమంటుంది వైద్యశాస్త్రం. ప్రాణం పోయడమే గానీ, తీయడం మా విధి గాదు. పోనీ మరో మార్గం చెబుతాను. నువ్వూ మళ్ళీ వోసారి ఆలోచించు. మీ రాజేష్‌ను గూడా మళ్ళీ వొకసారి కదిపిచూడు. మానస, మరోవ్యక్తి — యిద్దరిలో యెవరన్నో వొకరిని మాత్రమే రక్షించగలమని స్పష్టమయినప్పుడు, నీ కిష్టమయిన పనే చేస్తాను. కానీ అప్పుడు చివరి నిర్ణయం తీసుకోవలసిన వ్యక్తి నేనుగాదు. నువ్వు గూడా కాదు...."

"మరి.... ?"

"మానస అత్తా, మామా...."

"మళ్ళీ యిదేమిటండీ ?"

"అంత చదువుకున్నావు. యింత చిన్న విషయం అర్థంగాలేదా నీకు ? మానస కడుపులో వున్న బిడ్డకు స్వంత మనుషులెవరూ లేరని అనుకుంటున్నావు నువ్వు. తండ్రి చనిపోయినంత మాత్రాన ఆ బిడ్డ అనాధ అవుతుందా ? ఆ బిడ్డకు తల్లివుంది. తల్లి సైతం నిరాదరణ చేసిందనుకో, ఆ పైన వాళ్ళ తాతయ్యున్నాడు. ఆ బిడ్డ వాళ్ళవంశాంకురం, ఆ విషయం మరచిపోతున్నావు నువ్వు...." డాక్టర్ సుందరవల్లి కంఠస్వరం సాగర్ చెవుల్లో చాలా సేపటి వరకు

ప్రతిధ్వనిస్తూనే వుండిపోయింది.

## 8

"మంచితనానికి లోకంలో స్థానంలేదు. వేలు చూపెడితే మనిషినంతా మింగేసే స్వభావం మీది. తలనొప్పిగా వుందంటున్నాడు గదా, పోతేపోనీలెమ్మని వొకప్పు కాఫీ తాగిరమ్మంటే, గంటలతరబడీ అక్కడే వుండిపోతే యేమనుకోవాలి? నేను గూడా పొద్దుటినుంచీ గొడ్డుచాకిరీ చేశాను గదా? యిప్పుడు టయమెంత యింది? రెండున్నర. డ్యూటీ అయిపోయాక యింటికెళ్ళిపోవాలని నాకు గూడా వుంటుంది గదా! నాకు తెలుసులేవోయ్, మంచితనానికి లోకంలో స్థానం లేదు." కస్సుమంటూ పైకిలేచాడు రాజేష్.

"యెప్పుడూలేనిది, యింతమాత్రానికే యిలా మండి పడుతున్నావేమిటోయ్ యివ్వాళ? యేమయింది నీకు? మొదట తమాషాకు గొడవచేస్తున్నావేమోననుకున్నాను. తీరాచూస్తే...." విస్తుపోయాడు అతను.

"యిది చిన్న విషయమా? నీకలాగే వుంటుందిలే...." రాజేష్ ముఖం ముడుచుకున్నాడు.

"మరి? నాలుగైదురోజులుగా నీ సంగతి గమనిస్తూనే వున్నాను. నువ్వెందుకో వ్యర్థీగావున్నావు. అవునా?"

"నేనా? వ్యర్థీగానా? అదేమీలేదు...." తాను సులభంగా బయటపడిపోతున్నాడన్న విషయం స్ఫురించడంతో అతడు కంగారు పడిపోయాడు.

"నాకు తెలుసులేవోయ్! కొత్త వ్యక్తిని బుకాయించి నట్టుగా నన్ను యేమార్చలేవు. మూడేళ్ళగా మనంవొకేచోట పనిచేస్తున్నాం. అంతమాత్రం గ్రహించలేనా నేను? నువ్వెందుకో బాధపడుతున్నావు."

- "లేటుగా వచ్చింది చాలక, నన్నే క్రాస్ యెగ్జామిన్ చేస్తున్నావన్నమాట?" రాజేష్ ముఖం చాటు చేసుకున్నాడు. "నేను వెళ్తున్నాను. యేయిగారొచ్చి అడిగితే బ్లూప్రింటు రేపటికి రెడీ అవుతుందని చెప్పు...."

తన కొలీగ్ తనకేసి చిత్రంగా చూస్తున్న విషయాన్ని రాజేష్ గమనించలేకపోయాడు.

మట్టిరోడ్డుపైన చకచకానడవసాగాడు.

కొండవాళ్లని తెగగొట్టి కొత్తగా నిర్మించిన మట్టిబాట అప్పుడే తెగిన గాయంలా ఎర్రగా మెరుస్తోంది.

బాట కిరువైపులా ముళ్లపొదలు బారులు తీరి నిల్చుని వున్నాయి.

ఆకాశాన్ని అందుకోవాలన్న పోటీలో హెగ్గాని కాళ్ల విరగ్గొట్టుకుని, చతికిలబడిన వస్తామృగ్గా అటువైపొక కొండా, యిటువైపొక కొండా... మధ్యలో పరిగెడుతున్న నదీ ప్రవాహం... దాన్ని అరికట్టడంకోసం నిర్మించిన ఆనకట్టా.... ఆదృశ్యం ప్రకృతితో మానవుడు నెరపుతున్న నిరంతరపోరాటానికి భాష్యం చెబుతున్నట్టుగా కనిపిస్తోంది.

చేతిలోని టిస్క్వేయిర్నీ, కంపాసుబాక్సునీ మరోచేతిలోనికి మార్చుకుని రుమాలుతో చెమటను తుడుచుకుంటూ నడక సాగిస్తున్నాడు రాజేష్.

వేళదాటిపోవడంతో ఆకలి చచ్చిపోయింది.

కానీ చీకాకు మాత్రం తగ్గలేదు.

తనపై తనకే విసుగు కలుగుతోంది.

'వొకర్నని లాభమేముంది? తనకే బుద్ధిలేదు. తెలిసి తెలిసీ తప్పటడుగులు వేయడం తనకలవాటైపోయింది. యెన్ని యెదురు దెబ్బలు తగిలినా తనకు బుద్ధి రావడం లేదు. తలనొప్పిగా వుందని వాడు నటించి నంతమాత్రాన తానెందుకు కరిగిపోవాలి? నీపని గూడా నేనే చేస్తాను, వెళ్లి అరగంటలో రమ్మని బొట్టూ కాటుకా పెట్టి సాగనంపిన తరువాత, ఆలస్యం జరిగిందని ఆపోరించడ మెందుకు? తానొక బుద్ధిలేని వెధవ....' వెయ్యోసారి వొకటోసారి తిట్టుకున్నాడు అతను.

'అందరూ యింతే... మంచితనానికి లోకంలో తావులేదు. అమాయకుడెవడైన కనిపిస్తే, వాడినెత్తిపైన చేయిపెట్టడం కోసం అందరూ కాసుక్కూచుంటారు. యెదుటివాడి మంచితనానికొక్కడా కొన్ని హద్దులుంటాయని వొక్కడు... వొక్కడంటే వొక్కడయినా తెలుసుకోడెందుకు? అయినా వొకర్నని లాభమేముంది? పొరబాటు తనలోనే వుంది....' నిముషానికొకసారి నిట్టూరుస్తూ ముందుకు సాగిపోతున్నాడు — 'సుఖంగా సాగిపోతున్న జీవితాన్ని పరీక్షలపాలు చేయడం తన కలవాటై పోయినట్టుంది. సమయం దొరికింది లెమ్మనుకుని తను వుక్కు కౌగిళ్ళని మరింతగా బిగిస్తున్న పరిస్థితులమధ్య చిక్కి చిక్కరించడం మినహా తనిప్పుడు చేయగలిగిందేముంది? జీవితం ముళ్ళపాన్పయి పోతోంది. బ్రతుకొక శాపమై కూర్చొంది. యెన్నాళ్ళీపరీక్ష? తన జీవితాన్ని నందనవనంగా మార్చిపారేసే దేవత యెక్కడుంది? తన పెదవులకొక చిరునవ్వును అతికించగల మాంత్రికురాలెక్కడుంది? మానస... అవును, మానస.... మానస.... యేదీమానస? తన జీవితాన్ని పండించగల శక్తి మానసకుతప్ప మరెవరికుంది? అదిగో మళ్ళీ తన బుద్ధి పెడదారి పడుతోంది. తనకోసం సర్వ ప్రపంచాన్ని వదలిపెట్టి రాగలవ్యక్తి తనకిప్పుడు కావాలి. వదలిపెట్టాలని అనుకున్నా వదలిపెట్టనిగతం మానసనిప్పుడు వెంటాడుతోంది. అసలింతకూ ఆమె తనగతాన్ని వదలిపెట్టాలని అనుకుంటోయేని తానెలా నమ్మగలడు? యెటువెళ్ళాలో తోచక సతమతమైపోతున్న మానసకు ఆసరానిచ్చి ముందుకు నడిపించగల వ్యక్తి యెక్కడున్నాడు? దారిని చూపెట్టగలడని అనుకున్న వ్యక్తి నిష్ప్రయోజకుడై పోయాడెందుచేత? అతడెందుకు సందేహిస్తున్నాడు? యెందుకిలా మూర్ఖుడైపోయాడు? మూర్ఖత్వం.... అమాయకత్వం.. దిక్కుమాలిన పుస్తకాలన్నీ చదివిన పైత్యం... పొగరు... అన్నీకలిపి పోతపోసిన విగ్రహంలా తయారైపోయినట్టున్నాడు. లేకపోతే చంద్రమౌళిగారలా తన దగ్గరకొచ్చి' మరచిపోవాలని అనుకున్న విషయం మళ్ళీ జ్ఞాపకం రావడంతో విసుగ్గా నిట్టూర్చాడు. చేతిలోని టి స్క్వేయరు క్షణక్షణానికీ బరువెక్కుతున్నట్టుగా అనిపించసాగింది. 'యిదేమిటిలా శిలువలా తయారై కూచుంది? ముందు దీన్ని గడిలో గిరవాటేయాలి....'

హాల్ వ్యూ గెస్టుహవుసు యింకా ఫర్లాంగుదూరముంది.

మిగిలినదూరాన్ని గూడా నిట్టూర్పులతోనే కొలుస్తూ గెస్టుహవుసు ముంగిలిలోకొచ్చి నిల్చుండిపోయాడు.

యెండలోనుంచీ వొక్కసారిగా నీడపట్టుకు రావడంతో గది అంతా చీకటితో అలుక్కుపోయినట్టుగా కనిపించింది.

కళ్ళు నులుముకుంటూ లోపలికొచ్చాడు.

కుర్చీలో యెవరో కూచున్నట్టుగా స్పష్టాస్పష్టంగా కనిపించింది.

కళ్లు చిట్లించుకుని చూశాడు.

'పొద్దస్తమానమూ ఒకేరకమయిన ఆలోచనలతో విసిగిపోవడంచేత ప్రతి



వ్యక్తి సాగర్‌లాగే కనిపిస్తున్నట్టున్నాడు' అనుకున్నాడు.

'యిది భ్రమగా అనిపించడంలేదు. ఇతను నిజంగా సాగరేనేమో! యిదెలా కుదురుతుంది ? యీ సమయంలో యిక్కడ .. యిక్కడికెలా వచ్చాడు ?' కంగారును కప్పి పుచ్చుకోవడం కోసమన్నట్టుగా మంచంపైన కూర్చున్నాడు.

టీ పక్కాయరూ, కంపాకూ్సా చేతుల్లోనే వున్న విషయం జ్ఞాపకం వచ్చింది. రెండింటినీ ప్రక్కన పడేశాడు.

ముందెవరు మాట్లాడుతారోనని పందెం వేసుకున్నట్టుగా కాసేపు యిద్దరూ మౌనంగా కూచున్నారు.

చివరకు రాజేష్ వోడిపోయాడు.

"యెప్పుడొచ్చావు ?" అంటూ పలకరించాడు.

"గంటయింది...."

"యివ్వాళ కొంచెం లేటయింది." సంజాయిషీ యిస్తున్నట్టుగా చెప్పసాగాడు. "డ్యూటీ వొంటిగంటకే అయిపోయింది. కానీ మా కొలీగ్ వొకతను.... నాకు మవ్వొస్తున్నట్టుగా తెలియదు గదా ?...."

"........"

"అయిదు నిమిషాలు... రెండు చెంబుల నీళ్లు దిమ్మరించుకుంటేగానీ, యీ దుమ్ము వదిలిపెట్టదు..."

చల్లటి నీటితో స్నానం చేశాకగానీ ఆకలి సంగతి జ్ఞాపకం రాలేదు.

టేబులుపైన కారియరు సిద్ధంగా వుంది.

"భోంచేశావా నువ్వు?"

"పన్నెండింటికి భోంచేసి బయల్దేరాను. నువ్వు కానీయ్.... యిప్పటికే ఆలస్యమైపోయింది...."

కారియర్‌లోంచీ గిన్నెల్ని విప్పి, పింగాణీ ప్లేటులోకి వడ్డించుకున్నాడు.

"నువ్వు ఆఫీసు వైపుకైనా రాలేదట !...." అన్నాడు సాగర్.

"యిక్కడే సరిపోతోంది. యిటువైపు కొండపైన గెస్టుహవుసుందికదా ! అటువైపు కొండపైన గూడా యిలాంటిదే మరొక గెస్టుహవుసు కట్టాలని ప్లాను. యెంత తొందరలో వీలయితే అంత తొందరగా పని పూర్తిచేయమని ఛీఫ్ యింజనీర్‌గారి ఆర్డరు. సర్వేలూ, ప్లాన్‌డ్రాయింగ్— అన్నీ నా నెత్తిపైనే పడ్డాయి..."

సాగర్ మౌనంగా వుండిపోయాడు.

తిన్న శాస్త్రాన్ని ముగించాక, గిన్నెల్ని వొకవైపుకు సర్దిపెట్టి, పైకి లేచాడు రాజేష్.

వాష్ బేసిన్‌లో చేతులు కడుక్కొని, టవలుతో తుడుచుకుంటూ, వాలు కుర్చీలో కూర్చున్నాడు.

"యీరోజు సాయంకాలమైనా వూళ్ళోకొస్తున్నావా నువ్వు ?" అంటూ ప్రశ్నించాడు. సాగర్.

"కొంచెం యెండ తగ్గాక వెళ్దాం. నువ్వు ప్రాజెక్టు చూడాలన్నావుగదా వోసారి, సాయంకాలం వో అరగంటసేపు అలా తిరిగొచ్చాక యిద్దరమూ కలిసే వెళ్ళిపోవచ్చు...." దినపత్రికలో ముఖాన్ని దాచుకుంటూ జవాబు చెప్పాడు రాజేష్.

అరగంటసేపు దినపత్రికతో కాలక్షేపం చేస్తున్నట్టుగా నటించిన తరువాత, ముఖాన్ని అవతలకి తిప్పాడు.

సాగర్ కళ్లు మూసుకుని మంచంపైన పడుకుని వున్నాడు. నిద్రపోతున్నదీ లేనిదీ స్పష్టంగా తెలియడంలేదు.

పేపరు నవతలికి పారేసి, రాజేష్ తాను కూడా కాస్సేపు కునికిపాట్లు పడ్డాడు.

నాలుగున్నర గంటల ప్రాంతంలో ప్యూను ప్లాస్కులో కాఫీ తీసుకొచ్చాడు.

యిద్దరూ ముఖాలు కడిగి, కాఫీలు తాగి బయట పడ్డారు.

సూర్యుడు కొండవెనక్కి జారిపోయేముందుగా, చివరగా వోసారి తనవితీరా ఆనకట్టను కలయజూస్తున్నాడు.

ఆనకట్ట తలుపుల గుండా యివతలకి దుముకుతున్న జలపాతపు హోరు లయబద్ధంగా వినబడుతోంది.

అక్కడక్కడా శ్రామికుల గుంపులు కనిపిస్తూనే వున్నాయి.

మిత్రుడికి నిర్మాణ విశేషాలు వివరిస్తూ ఆనకట్టపైకి తీసుకొచ్చాడు రాజేష్.

"ఆనకట్టకి తలుపులు లేకుంటే బావుండేది. యెంచక్కా వచ్చిన నీళ్ళంతా యిక్కడే ఆగిపోయి వుండేవి" అన్నాడు సాగర్ యధాలాపంగా.

"అదెలా కుదురుతుంది ?" రాజేష్ విస్తుపోయాడు. "వేగంగా వచ్చే ప్రవాహపు తాకిడి నుంచీ ఆనకట్టను కాపాడ్డం కోసమూ, వాటర్ లెవల్‌ను డేంజర్ లైను దాటకుండా చూసుకోవడం కోసమూ తలుపులు తప్పనిసరిగా కావల్సిందే!"

"నిజమే ! నేనేదో పరధ్యానంగా వుండి అలా అనేశాను" బుద్ధిమంతుడిలా సాగర్ తప్పు వొప్పుకున్నాడు.

"ప్రకృతిని జయించానని మానవుడు అనుకుంటే అంత ఫూలిష్‌నెస్ మరొకటుండదు. యీ ఆనకట్ట మానవుడి ఆత్మవిశ్వాసానికీ, ఆదర్శానికీ సింబల్‌గా కనిపిస్తుంది నాకు. ఆదర్శం యెంత ఉన్నతమైనదయినా కావొచ్చు. కానీ దానికీ కొన్ని హద్దులుంటాయి గదా !"

దెబ్బతగలవలసిన చోటే తగిలింది. సాగర్ వో ట్రాక్‌పైన కూలబడిపోయాడు.

'తన వాదనలోని సహేతుకత్వాన్ని యెంత సునాయాసంగా వెల్లడిచేయ కలిగాడు తాను ! ఆలోచనలకు పదును పెట్టవలసిన అవసరమయినా రాలేదు. మాటలకోసం వెతుక్కోవలసిన అగత్యమయినా కలగలేదు !' తన తెలివి తేటలకు తానే ఆశ్చర్యపడిపోయాడు రాజేష్. అతడి ముఖంలో విజయగర్వం తొంగి చూసింది. జేబులోంచీ సిగరెట్టు పెట్టె పైకి లాగి, మిత్రుడి ముందుకు చూపాడు.

సాగర్ వొద్దన్నట్టుగా తలవూపాడు.

తానొక సిగరెట్టు వెలిగించుకుని, ట్రాక్‌పైన కూర్చున్నాడు రాజేష్.

"నాకేమిటో అంతా అయోమయంగా వుంది రాజూ ! యేంచేయాలో తోచడం లేదు...." సాగర్ తన నిస్సహాయతను బయట పెట్టేశాడు. "చంద్రమౌళిగారి ధోరణి నాకు అర్థంగావడం లేదు. వొక్కోసారి ఆయన వాదంలోనూ న్యాయమున్నట్టుగా అనిపిస్తోంది. అందుకే వోసారి నిన్ను కలవమని చెప్పానాయనతో...."

"చాలా గొప్పపని చేశావు !" వెటకారం చేస్తూ అడ్డుతగిలాడు రాజేష్. "అవతల మా అమ్మానాన్నలకూ, అన్నయ్యకూ ఎలా నచ్చజెప్పాలో తోచక సతమతమైపోతున్నాన్నేను. చాలని దానికి, ఆయనగారిని గూడా నాపైకి తోలేసి, తమాషా చూడాలనుకున్నావు ఆయన జలగలా పట్టినపట్టు వదలి పెట్టలేదు...."

"వొకసారి ఆయన వైపునుంచీ గూడా ఆలోచించి చూడు రాజూ !" ప్రాధేయపడ్డాడు. సాగర్.

"ఆయన కొచ్చిన కష్టమేమిటిప్పుడు ?" రాజేష్ విసుక్కున్నాడు.

"యింట్లో ఆయనా, వాళ్లావిడా—మరో వ్యక్తి లేడు. వాళ్లవంశం ఆయనతో అంతమైపోతోంది గదా అని బాధపడుతున్నాడు. బిడ్డను తానే పెంచుకుంటానని అంటున్నాడు గదా ?"

"వంశం వంశమంటూ బీసీ నాటికబుర్లు చెప్పొద్దు సాగర్ ! వంశమూ, వంశవృక్షమూ అన్నీ ట్రాష్....ఆమాటకొస్తే యేవంశమయినా శాశ్వతంగా గూటంగొట్టుకుని అఘోరించిందేమో చూపెట్టుచూద్దాం. నేనూ చరిత్ర చదువుకున్నాను. యీదేశాన్ని యెన్ని వంశాలు పరిపాలించాయి ? యేమయిపోయాయా వంశాలన్నీ ? అంతెందుకు ? మీ ముత్తాతగారి పేరేమిటో చెప్పచూద్దాం ! రెండు మూడుతరాలకు మునుపు యెవరెవరెలా వున్నారో తెలియనప్పుడు. వంశమూ, వంశవృక్షమూ అనే పడికట్టుమాటల్ని వప్పజెప్పడమెందుకు ? యింత చదువు చదివీ, యిలా మాట్లాడ్డానికి సిగ్గుకలగడం లేదా నీకు ?..."

( 65 వ పేజీ చూడండి )

దేవి మూర్తి: శిద్ధాయిక?

జినమతములో సింహం లాంఛనముగా గల శాసన దేవతలు ఇద్దరున్నారు. వారు అంబిక మరియు సిద్ధాయిక. అంబికనేమి నాథుని (22-వ తీర్థంకరుడు) శాసన దేవతలు ఈ రెండింటిలో జిన గుహలో గల దేవీమూర్తిని శిద్ధాయికగా గుర్తించుట సమంజసము. ఏలయన శాస్త్ర పరంగా జినాంబిక సింహం లాంఛనం గల్గి రెండుచేతులు కల్గి, మామిడికాయ గుత్తులు, పిల్లలు మొదలగు వివిధ వస్తువులు ధరించి వుండాలి. ఈ వర్గమునకు భిన్నంగా రామతీర్థంలోని జినగుహ యందుగల దేవీమూర్తి శిల్పించబడినది.

ఇక శిద్ధాయక జిన తీర్థంకరులలో కడపటి వాడగు మహావీరుని శాసనదేవత. శాస్త్రపరంగా చతుర్భుజములు కల్గివుండి, విధిగా పుస్తకం కల్గి వుండాలి. ప్రస్తుత జినదేవత శిద్ధాయిక వర్ణనకు కడు సమీపంలోనున్నది. జిన గుహ కడు చీకటి మూలంగా చాయాచిత్రం సరిగ్గా లేనందున వివరణలను వివరంగా గుర్తించుట కష్టతరముగా నున్నది. అయినా చతుర్భుజములు కల్గి, సింహ లాంఛనముతో వున్నది. ఇందు సందేహములేదు. అయిన రామతీర్థంలోని జైన గుహ యందున్న దేవీమూర్తిని దుర్గగా భ్రమించి జినగుహను దుర్గమ్మకొండగా గుర్తించి యుండవచ్చును. నిజానికి రూపంలో దుర్గకు సామ్యంలోనున్నా, ఆ దేవీమూర్తిని జినదేవతయగు శిద్ధాయికగా గుర్తించుటే సమంజసము, సహేతుకం. పైగా జినగుహలో దుర్గశిల్పం శిల్పించుట కడు విడ్డూరం, అసంగతం గూడాను. పై పరిశోధన దృష్ట్యా రామతీర్థంలోని దుర్గమ్మ కొండను జిన కొండగా గుర్తించుట చరిత్ర సమ్మతం, సబబుగూడాను.

## పరిశీలించిన గ్రంథాలు


1. దక్షిణ భారత వార్షిక శాసనముల సంపుటి, 1918, అనుబంధం. బి. నం: 881. పుట 188.
2. జె. పి. జైన్; జైన్ సోర్సెస్ ఆఫ్ ది హిస్టరీ ఆఫ్ ఏన్షియంట్ ఇండియా పుట 205.
3. అదే పుట 206.
4. దక్షిణ భారత వార్షిక శాసనముల సంపుటి, 1918, పుట 134.
5. రూపమండనము, పుటలు 98 మరియు 99.


## సహగమనం

(29 వ పేజీ తరువాయి)

"పోనీ ఆసంగతి వదలిపెట్టు, నన్నుమరో సందేహం వేధిస్తోంది..."

"యేమిటది ?" రాజేష్ గొంతుకలో అవహేళన తొంగి చూసింది.

"మరి....మానవత్వమని పంచుకోని పనిచేస్తున్నామే మానని...."

"అంటే ?!"

"జీవించే హక్కున్న ప్రాణిని బలవంతంగా, నిర్దాక్షిణ్యంగా...."

"నీకు పిచ్చిగానీ యెక్కలేదుగదా ?" రాజేష్ అసహనంగా అడ్డు తగిలాడు.

సాగర్ బిక్కు బిక్కు మంటూ చూడసాగాడు.

"నీ చెల్లెలి జీవితం యిప్పుడు నాశనమైపోబోతోంది. దాన్నెలాగైనా అరికట్టడం నీ బాధ్యత, నీ డైలమాసిల్లీగా వుంది. నువ్విలా మీనమేషాలు లెక్క పెడుతూ కూర్చుంటే చేయిదాటిపోతుంది. దేన్నయినా విరిచేయదలచుకున్నప్పుడు మొక్కగా వున్నప్పుడే ప్రయత్నించాలి. చేతులు కాలింతరువాత ఆకులుపట్టుకుంటే లాభం వుండదు...."

"అదికాదు రాజూ...."

"నువ్వడుగుతున్న సహాయం నేను చేయలేను. యీ పెళ్లికి మావాళ్లను వొప్పించడం యెంత కష్టమో నీకూ తెలుసు. యీ సమస్యను మరింత కాంప్లికేటెడ్‌గా మార్చుకోవడం నా కిష్టంలేదు...."

"ప్లీజ్ రాజూ...."

"నన్ను అర్థం చేసుకోవెందుకు నువ్వు ? 'క్లాడియస్'లా బ్రతకడం నా కిష్టంలేదు. అలాంటి జీవితాన్ని తలచుకోవడానికే వణుకుపుడుతోంది నాకు...."

"నువ్వు 'క్లాడియస్' వెలా అవుతావు ? 'హామ్లెట్' తండ్రిని చంపి, అతడి తల్లిని పెళ్లి చేసుకున్నవాడు క్లాడియస్. వాడొక యుజర్పర్, ద్రోహి, కానీ నువ్వు చేస్తున్న పని అదిగాదు. నిస్సహాయురాలైన స్త్రీకి పునర్జన్మ నిస్తున్నావు, ఆమె బిడ్డ నీకు ఆజన్మాంతం ఋణపడి వుంటుంది...."

"నీ వూహ పొరబాటు, తండ్రిచనిపోయిన తరువాత. తన తల్లి మరోవ్యక్తిని పెళ్లిచేసుకున్నదన్న విషయం, ఆ బిడ్డకు తెలిస్తే యేమవుతుంది ? తల్లిపైన అసహ్యం కలుగుతుంది. తండ్రి స్థానంలోని వ్యక్తిపైన ప్రతీకారం తీర్చుకోవాలని అనిపిస్తుంది...."

"అలా యెందు కనుకోవాలి ? తన తల్లిసైతం మానవ మాత్రురాలేనన్న విషయం. ఆ బిడ్డకు తెలియక పోతుందా !...."

"తల్లి కిచ్చిన స్థానం చాలా విలువైంది సాగర్ ! తన తల్లికి మిగిలిన ప్రపంచంలోని యేవ్యక్తీ సాటిరాదని అనుకుంటారందరూ..."

"మరోసారి ఆలోచించి చూడు రాజూ !" సాగర్ ప్రాధేయపడ్డాడు.

"నువ్వేనా పరిస్థితిలో వుంటే యేం చేస్తావో చెప్పుసాగర్ చూద్దాం ! ఆదర్శాలు వల్లించి నంత సులభంగా ఆచరణలో పెట్టడం సాధ్యంగాదు...."

"రాజూ !"

"యెంత ఆదర్శాని కయినా కొన్నిహద్దులున్నాయి. నేను సైతం మానవుడ్నే గదా ! నన్ను మనీషిగా మారమంటున్నావు నువ్వు, నాచేతగాదు....అంటూ తేల్చి చెప్పేశాడు రాజేష్.

ఆనకట్ట తలుపులగుండా దుముకుతున్న జలపాతపుహోరు, సాగర్ చెవులకు కర్ణకఠోరంగా వినబడసాగింది.

(ఇంకా వుంది)